క్లుప్తంగా

ఎరుకుమాంబకు జలాభిషేకం



ఎరుకుమాంబ అమ్మవారికి జలాభిషేకం చేస్తున్న ఈవో, భక్తులు

సీతమ్మధార: దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఈవో రమాబాయి ఆధ్వర్యంలో అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ అనంతరం అమ్మవారికి పూజలు చేశారు. ఈ సందర్భంగా భక్తులు అమ్మవారికి జలాభిషేకం నిర్వహించారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు జరిగాయి. సాయంత్రం కూడా అమ్మవారికి భక్తులు జలాభిషేకం చేశారు. అనంతరం అమ్మవారికి నూతన చీరతో పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించి ప్రసాద వితరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది సత్యనారాయణరాజు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

డీఈవోను కలిసిన అసోసియేషన్ ప్రతినిధులు



డీఈవో ప్రేమ్‌కుమార్‌కు అభినందనలు తెలుపుతున్న అసోసియేషన్ ప్రతినిధులు

దాబాగార్డెన్స్: జిల్లా విద్యాశాఖాధికారిగా ఇటీవల నియమితులైన ప్రేమ్‌కుమార్‌ను ఏపీ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ విశాఖ జిల్లా కార్యవర్గం బుధవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసింది. ఈ సందర్భంగా డీఇవో మాట్లాడుతూ ఎప్పటిలానే అసోసియేషన్ సహాయ సహకారాలు అందివ్వాలని కోరారు. అనంతరం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బీవీ మురళీ మనోహర్ ప్రైవేట్ స్కూల్ ఎదుర్కొంటున్న సమస్యలు, బడ్జెట్ తదితర సమస్యలు డీఇవో దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాస్, కోశాధికారి సీహెచ్‌వీఆర్ మూర్తి, వైవీ ప్రసాద్, జీఎస్ నాయుడు, సూరిబాబు, శ్రీనివాస్, జనార్దన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల కొవ్వొత్తుల ర్యాలీ



కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న సీపీ శంఖబ్రత బాగ్చి

ఏయూక్యాంపస్: పోలీసు అమరవీరులను స్మరించుకుంటూ విశాఖ పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బుధవారం సాయంత్రం విక్టరీ ఎట్ సీ నుంచి అమరవీరుల స్మృతి స్థూపం వరకు ఈ ర్యాలీ సాగింది. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తూ ప్రజల కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవాలన్నారు. అమరవీరుల కుటుంబాలకు మనం ఎల్లవేళలా అండగా ఉండాలని కోరారు. దేశం కోసం, రాష్ట్రం కోసం, మన నగరం కోసం ఎంతటి త్యాగానికైనా సిద్ధంగా ఉంటామని పతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డీసీపీ(లా అండ్ ఆర్డర్) అజిత వేజెండ్ల, జాయింట్ సీపీ(ఇన్‌చార్జి) డీసీపీ-2 డి.మేరీ ప్రశాంతి, నగర ఏడీసీపీలు, ఏసీపీలు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



అమ్మకానికి సిద్ధం చేసిన చెరకు



కలగూరలు, పండ్లతో వ్యాపారులు

మార్కెట్‌కు దీపావళి శోభ

- కిక్కిరిసిపోయిన పూర్ణామార్కెట్
- పెద్ద ఎత్తున సామగ్రి కొనుగోలు చేసిన వినియోగదారులు
- ఆకాశాన్నంటిన పూలు, పండ్ల ధరలు
- జోరుగా అనధికార క్రాకర్ల అమ్మకాలు



కొత్తరకం ప్రమిదలు కొనుగోలు చేస్తున్న మహిళలు



అల్లిపురం కుమ్మరవీధిలో దీపం కుందుల విక్రయాలు

జగదాంబ: పూర్ణామార్కెట్ దీపావళి శోభ సంతరించుకుంది. గురువారం దీపావళి పండగ కావడంతో బుధవారం మార్కెట్ జనాలతో కిక్కిరిసిపోయింది. వినియోగదారులు వారికి కావల్సిన పూజా సామగ్రితో పాటు ఇతర వస్తువుల కొనుగోలుకు మార్కెట్‌కు రావడంతో మార్కెట్ కళకళలాడిపోయింది. కాకర్ల అమ్మకాలు, ప్రమిదలు, పూజాసామగ్రి, పువ్వులు, చెరకులు, కలగూరల అమ్మకం దుకాణాలు అధికంగా వెలిశాయి. దీపావళి పండగ నేపథ్యంలో పువ్వుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. 50 గ్రాముల పువ్వులు రూ. 150కి పైగా విక్రయించారు. యాపిల్ కిలో రూ. 350కు చేరింది. దానిమ్మ చిన్నవి కిలో రూ.350 ఉంటే పెద్దవి రూ. 500కి విక్రయించారు. నల్లద్రాక్ష రూ.80 నుంచి రూ. 100, అరటిపండ్లు కిలో రూ. 100, బత్తాయిలు కిలో రూ. 120 ఉండగా అరటిదొప్పలు, తమలపాకుల ధరలు కూడా పెరిగిపోయాయి. చెరకు, ఆముదం కర్రలు, మట్టి ప్రమిదల ధరలు అకాశాన్నంటాయి. అగరబత్తీలు, కొబ్బరికాయల ధరలు అమాతం పెరిగిపోయాయి.

అనుమతులు లేకపోయినా అమ్మకాలు..

దీపావళి క్రాకర్ల అమ్మకాలకు మార్కెట్‌లో అనుమతులు లేకపోయినా కొందరు వ్యాపారులు యాథావిధిగా అమ్మకాలు సాగించారు. ప్రజల సౌకర్యార్థం పోలీసులు ఏయూ గ్రౌండ్‌లో స్టాల్స్‌కు అనుమతులు ఇచ్చారు. అయినా మార్కెట్ చుట్టుపక్కల ప్రాంతాలైన స్ప్రింగ్‌రోడ్డు, పందుపుల్లల సందు, పువ్వుల వీధి, పూర్ణామార్కెట్ లోపల, బ్యారెక్స్ రోడ్డులో ఎటువంటి అనుమతులు లేకుండా క్రాకర్ల వ్యాపారాలు జరుగుతున్నాయి. జనసంచారం ఉన్న ప్రాంతాలు కావడంతో ఏమాత్రం ప్రమాదం జరిగినా పెద్ద ఎత్తున నష్టం వాటిల్లే ప్రమాదం ఉంది.

కిక్కిరిసిన బజార్లు..

అల్లిపురం: దీపావళి శోభ నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో వెల్లివిరుస్తోంది. అల్లిపురంలో పలు కూడళ్లలో పండగ సామగ్రి విక్రయాలు జోరందుకున్నాయి. పూలు, పండ్లు, కలగూరలు, ఆముదం కర్రలు, క్రాకర్ల అమ్మకాలతో ఈ ప్రాంతం రద్దీగా మారింది. కుమ్మరవీధిలో ప్రమిదల కొనుగోలుకు మహిళలు ఆసక్తి చూపుతున్నారు. అదే విధంగా దొండపర్తి, రైల్వేన్యూకాలనీ, రామా టాకీసు ఏరియాల్లో కూడా పండగ సామగ్రి విక్రయాలతో రహదారులు కిక్కిరిసిపోయాయి. ధరలు ఆకాశాన్ని అంటుతున్నా వినియోగదారులు తప్పనిసరి అయి కావల్సిన సామగ్రి కొనుగోలు చేసుకున్నారు.



పువ్వులు కొనుగోలు చేస్తున్న మహిళలు



దిష్టిదండ కొనుగోలు చేస్తున్న వినియోగదారుడు



పత్రి, ఆముదం కర్రలు కొనుగోలు చేస్తున్న మహిళ


వృద్ధురాలికి వైద్య సేవలు



వృద్ధురాలిని ఆస్పత్రికి తరలిస్తున్న ఏయూటీడీ ప్రతినిధులు

సీతమ్మధార: సీనియర్ సివిల్ జడ్జి వెంకట శేషమ్మ ఇచ్చిన ఆదేశాల మేరకు ఓ వృద్ధురాలు రోడ్డున పడి ఉన్నారన్న విషయం తెలుసుకుని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు, సంస్థ సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లి బాధితురాలిని కలుసుకున్నారు. ఆమె పేరు నాయికుల గోవిందమ్మ (80) అని, ఆమె శివాజీపాలెంలోని బలరామ్‌నగర్‌లో గల కూతురు దుర్గ, కొడుకు సింహాచలంతో ఉంటున్నట్లు తెలిపింది. ప్రస్తుతం ఇల్లు లేక జడ్జి క్వార్టర్స్ ఎదురుగా ఒక ప్లాస్టిక్ బ్యానర్ నీడన అనారోగ్యంతో జీవచ్ఛవంలా పడి ఉంది. జిల్లా న్యాయ సేవా సదన్ సిబ్బంది ఇచ్చిన ఫోన్ నంబర్‌తో విమ్స్ డైరెక్టర్ రాంబాబుతో మాట్లాడగా పూర్తిగా ఉచిత వైద్యం అందిస్తామని చెప్పారు. వెంటనే ఆమెను ఏయూటీడీ ప్రతినిధులు ఆస్పత్రిలో చేర్చారు. డాక్టర్ సహానా పర్యవేక్షణలో వైద్యం అందుతోంది. పరీక్షలు చేశాక వృద్ధురాలికి డెంగ్యూ అని తెలిసింది. ఆమె పూర్తిగా కోలుకున్నాక ఏయూటీడీ, జీవీయంసీ షెల్టర్‌కు తరలిస్తామని నిర్వాహకులు తెలిపారు.

పెన్షనర్ల కార్యాలయంలో వృద్ధుల దినోత్సవం



మాట్లాడుతున్న జిల్లా సివిల్ జడ్జి వెంకట శేషమ్మ

మహారాణిపేట: విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ సమీపంలో ఉన్న పెన్షనర్స్ భవన్‌లో 'అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవం' బుధవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ, సీనియర్ సివిల్ జడ్జి ఎం. వెంకట శేషమ్మ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వృద్ధుల సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ఎం.మాధవి, జిల్లా ప్రభుత్వ పెన్షనర్లు తదితరులు పాల్గొన్నారు.

పెంటకోట సేవలు నిరుపమానం



చంద్రరావుకు రిటైర్ బెనిఫిట్స్ అందజేస్తున్న డీటీవో గోవిందరావు

మహారాణిపేట: ట్రెజరీ శాఖలో 22 ఏళ్ల పాటు పని చేసిన పెంటకోట చంద్రరావు బుధవారం పదవీ విరమణ చేశారు. చిన్న ఉద్యోగిగా చేరి సబ్ ట్రెజరీ అధికారి (ఎస్‌టీవో)గా రిటైర్ అయ్యారు. 1992లో క్యాషియర్‌గా చోడవరం సబ్ ట్రెజరీ కార్యాలయంలో చేరి అంచెలంచెలుగా ఎదిగి అనేక పదవులు చేపట్టి పింఛనుదారుల మన్ననలు పొందారు. ఆయన ప్రతిభకు గుర్తింపుగా ఆరుసార్లు ఉత్తమ ఉద్యోగి అవార్డులు పొందారు. బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో చంద్రరావును సన్మానించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ట్రెజరీ అధికారులు జి.నాగార్జునరావు, నితిన్ జోషి, రమణారెడ్డి, ఎస్‌టీవోలు కామేశ్వరరావు, ఆర్.సన్యాసమ్మ, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యురాలి ఘటనలో దోషులను శిక్షించాలి



జీవీఎంసీ గాంధీ పార్కులో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల ప్రతినిధులు

సీతమ్మధార: కోల్‌కత్తాలోని డాక్టర్ అభయ కేసులో సీబీఐ విచారణ పూర్తి చేసి, దోషులందరినీ వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ జీవీఎంసీ గాంధీ పార్కులో ప్రజాసంఘాలు నిరసన కార్యక్రమం చేపట్టాయి. ఈ సందర్భంగా పీవోడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. లక్ష్మి మాట్లాడుతూ కోల్‌కతా ఆస్పత్రిలో మహిళా డాక్టర్‌ని పని స్థలంలో అత్యాచారం చేసి హత్య చేసిన విషయం తెలిసిందేనని, ఈ అంశంలో దోషులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ), ప్రగతిశీల మహిళా సంఘాల జాతీయ సమన్వయ కమిటీ ఈ ఘటనను ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం. వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు వై. కొండయ్య, విద్యా పరిరక్షణ కమిటీ ప్రతినిధి కిశోర్, భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షుడు టి. శ్రీరామ్మూర్తి, భీం సేన వార్ అధ్యక్షుడు కె. చిన్నారావు, న్యాయవాది చలం, పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షులు ఎస్. వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్తీక మాసోత్సవాలకు ఏర్పాట్లు

సీతంపేట : సీతంపేటలోని దేవదాయ శాఖ పరిధిలో గల పార్వతీశ్వరాలయంలో నవంబర్ 2 నుంచి డిసెంబర్ 1వరకు కార్తీక మాసోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహిస్తామని ఆలయ అర్చకులు గంగవరపు శివాజీ శర్మ, భాస్కరశర్మ తెలిపారు. ఉత్సవాలకు సంబంధించిన కరపత్రాలను బుధవారం ఆలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్తీకమాసం నాలుగు సోమవారాల్లో పార్వతీశ్వరునికి అభిషేకాలు నిర్వహిస్తామన్నారు.

చిన్నారుల దీపావళి సందడి



సాంప్రదాయ వస్త్రధారణలో చిన్నారులు

అల్లిపురం: జాతి, కుల,మత, వర్గ విభేదాలను విస్మరించి సమైక్యంగా జరుపుకునే పండగే దివ్య దీపావళి అని రవీంద్ర భారతి స్కూల్ ప్రిన్సిపాల్ పి. శారదా రెడ్డి అన్నారు. బుధవారం దీపావళి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు సాంప్రదాయ వస్త్రాలంకరణలో అలంకరించారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి ఎన్. వెంకటేష్, ఎంజీఆర్ వసంత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

నాట్య కళాక్షేత్ర విద్యార్థినులకు అభినందనలు

సీతమ్మధార : సీతమ్మధారలోని నాట్య కళాక్షేత్ర విద్యార్థినులను పలువురు అభినందించారు. శ్రీపొట్టి శ్రీరాములు విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో విజయనగరంలోని మహారాజ కళాశాలలో నిర్వహించిన సర్టిఫికెట్ పరీక్షలో భరతనాట్య కళాకారులు పి.సాయి అక్షిత, వి.కమల శ్వేత, ఎం.ఎస్. అనన్య, పి.శ్రేష్ట ఉత్తీర్ణత సాధించారు. వీరిని నాట్య కళాక్షేత్ర వ్యవస్థాపకురాలు కె.మాధవి, నాట్య గురువు కె.వెంకట్ చిన్నారావు, కార్యదర్శి డి.రాజేష్, తల్లిదండ్రులు అభినందించారు.

ట్రాఫిక్ నియమాలు పాటించకుంటే చర్యలు

సీతమ్మధార : వాహన చోదకులంతా ట్రాఫిక్ నియమాలు పాటించాలని ద్వారకా ట్రాఫిక్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. బాలయ్య శాస్త్రి లే అవుట్, గురుద్వార పరిసర ప్రాంతాల్లో బుధవారం ఆయన వాహనాలు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని కోరారు. ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లరాదని సూచించారు. బస్టాపుల వద్ద ఆటోలు పార్కింగ్ చేయొద్దని, త్రిబుల్ రైడింగ్, రాంగ్ రూట్ ప్రమాణాలు మానుకోవాలని హితవు పలికారు. రోజూ డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించి వాహన చోదకులను కోర్టులో హాజరుపరుస్తున్నామని గుర్తు చేశారు. మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇవ్వరాదని కోరారు. వాహనాలు నడుపుతూ ఫోన్‌లో మాట్లాడితే ప్రమాదాలకు గురవుతారని హెచ్చరించారు. పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు బస్సుల ఫుట్‌పాత్‌లపై వేలాడుతూ ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారని, జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఫుట్‌పాత్ ప్రయాణాలు ప్రమాదకరమని ఆయన హెచ్చరించారు.

మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆరా



ఏర్పాట్లపై ఎమ్మెల్యేకి వివరిస్తున్న ఆలయ ఈవో శోభారాణి

దాబాగార్డెన్స్: ఉత్తరాంధ్ర జిల్లాల ఇలవేల్పు కనకమహాలక్ష్మి మార్గశిర మాసోత్సవాల ఏర్పాట్లపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ బుధవారం ఆరా తీశారు. ముందుగా అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. డిసెంబర్ 2 నుంచి 30 వరకు నిర్వహించనున్న మార్గశిర ఉత్సవాల ఏర్పాట్ల గురించి ఆలయ ఈవో కె. శోభారాణితో చర్చించారు. ఏడాదికేడాది ఉత్సవాలకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్న దృష్ట్యా ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ముఖ్యంగా కనీస వసతులైన చలువ పందిళ్లు, క్యూలైన్లు, తాగునీటి సరఫరా తదితర ఏర్పాట్లు చేయమని సూచించారు. ఏర్పాట్ల పరిశీలనలో వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ సీఐ దేముడుబాబు, పోలీసు అధికారులు, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఏడీ శ్రీనివాస్‌కుమార్ సేవలు ఎనలేనివి



శ్రీనివాసకుమార్‌ను సన్మానిస్తున్న డాక్టర్ శివానంద్

మహారాణిపేట: కేజీహెచ్‌లో రెండున్నర సంవత్సరాల పాటు అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్)గా విధులు నిర్వర్తించి పదోన్నతిపై గవర్నమెంట్ మెడికల్ కాలేజీ, శ్రీకాకుళంలో డిప్యూటీ డైరెక్టర్‌గా వెళ్లిన సి.హెచ్. శ్రీనివాసకుమార్‌కు బుధవారం వీడ్కోలు పలికారు. కేజీహెచ్ ఎథిక్స్ గ్యాలరీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద శ్రీనివాస్ కుమార్‌ను సన్మానించారు. అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఆయన సేవలను గుర్తు చేసుకున్నారు. క్యాజువాలిటీ విస్తరణ, లైటింగ్ ఏర్పాటు, పర్యావరణ హిత కార్యక్రమాలు, బ్యాటరీ వాహనాల కొనుగోలు, సోలార్ ప్యానెల్స్ ఏర్పాటులో శ్రీనివాసకుమార్ పాత్ర కీలకమైందన్నారు. ఆయన కేజీహెచ్ నుంచి వెళ్లిపోవడం ఈ ఆస్పత్రికే లోటు అన్నారు. అసిస్టెంట్ డైరెక్టర్ (అడ్మిన్) లోకనాథం, డిప్యూటీ సీఎస్ఆర్ ఎంవో డాక్టర్ మెహర్ కుమార్, డాక్టర్ భాస్కర్, డాక్టర్ రాజేష్, చీఫ్ డైటీషియన్ హెచ్. వెంకట రమణమూర్తి, నర్సింగ్ సూపరింటెండెంట్ పద్మావతి, ఆస్పత్రి అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కిరణ్, సెక్రటరీ మంగరాజు, మేనేజర్ పి.ఎం.జవహర్‌లాల్, అకౌంటెంట్ జి.సత్యనారాయణ, ఎంఆర్‌వో వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, కర్షక సంక్షేమమే ధ్యేయం



ద్వారకానగర్‌లో నిరసన తెలుపుతున్న ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ఏఐటీయూసీ 105వ ఆవిర్భావ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని వక్తలు కోరారు. బుధవారం ద్వారకానగర్ బుధిల్‌పార్క్ ఆటో స్టాండ్‌లో యు. శివాజీ, ఆర్టీసీ కాంప్లెక్స్ ఇన్ గేటు వద్ద బి. నూకరాజు ఏఐటీయూసీ జెండా ఎగరవేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యుడు జి.వామనమూర్తి మాట్లాడుతూ భారతదేశంలో మొట్టమొదట ఏఐటీయూసీ ఆవిర్భవించిందని తెలిపారు. నాటి నుండి దేశ సమైక్యత, కార్మిక హక్కుల సాధన, పరిశ్రమల పరిరక్షణ, రైతాంగానికి మేలు జరగాలని ఎన్నో ఉద్యమాలు చేసిందన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ అధికారంలోకి వస్తే 100 రోజుల్లో పెట్రోల్, డీజిల్ ధరలు తగ్గిస్తామని, నిరుద్యోగాన్ని నిర్మూలిస్తామని హామీ ఇచ్చారన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్, ప్రభుత్వ రంగ పరిశ్రమల ప్రైవేటీకరణ ప్రతిపాదన విరమించాలని, భారీగా జరిమానాలు వసూలు చేసే జీవో నంబర్ 21, 31 రద్దు చేయాలని, డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యు. శివాజీ, కె. దేముడు, ఎం.నాగరాజు, కేలం శివ, బి. నూకరాజు, రావి కృష్ణ, ఈశ్వర్, పి. వాసు, జె. వాసు, ఎన్. ఆది రాజు తదితరులు పాల్గొన్నారు.

'ఎంత పని చేశావ్ చంటి'కి ప్రేక్షకాదరణ

సినిమా సక్సెస్ మీట్‌లో హీరో శ్రీనివాస్, డైరెక్టర్ ఉదయ్



సక్సెస్ మీట్‌లో చిత్ర యూనిట్

దాబాగార్డెన్స్: ఈ నెల 25న విడుదలైన ఎంత పని చేశావ్ చంటి సినిమా 50 థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శిస్తున్న సందర్భంగా వెంకటేశ్వర థియేటర్‌లో బుధవారం సక్సెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా చిత్ర హీరో శ్రీనివాస్ ఉలిశెట్టి మాట్లాడుతూ హీరోగా అవకాశం ఇచ్చిన డైరెక్టర్ ఉదయ్‌కుమార్, లద్దే బ్రదర్స్‌కి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చిత్రంలో తనను ఎంతగానో సపోర్ట్ చేసిన నటులు, టెక్నీషియన్స్, ప్రేక్షకులు, ఆత్మీయులు, కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రతి మనిషిలోనూ ఇద్దరు వ్యక్తులు ఉంటారని అంతర్మథనంలో ఉండే వ్యక్తి ఆలోచనలు ఏ విధంగా ప్రవర్తిస్తాయనేదే ఈ సినిమా కథ అని, దీన్ని డైరెక్టర్ ఉదయ్ ప్రేక్షకుల కళ్లకు కట్టినట్లుగా చూపించారని అన్నారు. డైరెక్టర్ ఉదయ్ మాట్లాడుతూ ఈ సినిమా సక్సెస్ మరింత బాధ్యత పెంచిందన్నారు. హీరోగా మంచి టాలెంట్, డెడికేషన్ ఉన్న వ్యక్తిని ఎంచుకున్నానని, సినిమా సక్సెస్‌కు సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. పీజేకే బ్యానర్‌పై నిర్మించిన ఈ చిత్రం సక్సెస్ మీట్‌లో నిహారిక కేశవ్, పటాన్ జిలాన్ ఖాన్, జీవీ త్రినాథ్, అమ్మరాజు, భాస్కరాచారి, నవ్వుల దామోదర్, ఎం.టి.రాజు, ఎం.శ్రీనివాస్, దుర్గాప్రసాద్, కో డైరెక్టర్ బి.సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మద్యం దుకాణం వద్ద 13వ రోజు ఆందోళన



ఆందోళన చేస్తున్న భూపేష్‌నగర్ ప్రజలు

అల్లిపురం: మంచి ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం చేస్తున్న మంచి ఎక్కడ అని కుల వివక్ష పోరాట సమితి నాయకులు వై.రాజు ప్రశ్నించారు. గత 13 రోజులుగా భూపేష్‌నగర్ వద్ద మద్యం దుకాణం వద్దు అంటూ స్థానిక మహిళలకు చేస్తున్న ఆందోళనకు కేవీపీఎస్ బుధవారం తన మద్దతు తెలియజేసింది. ఆందోళనకారులతో కలసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ మంచి ప్రభుత్వం అని గొప్పలు చెప్పుకుంటున్న కూటమి ప్రభుత్వం జనావాసాల మధ్య మద్యం దుకాణాలు పెట్టడం ఎంత వరకు సమంజసమన్నారు. శివాలయం, మసీదు, చర్చిలు, స్కూల్స్ ఉన్నచోట మద్యం దుకాణం వద్దని ఆందోళన చేస్తున్నా పట్టించుకోని ఇది మంచి ప్రభుత్వమా అని ప్రశ్నించారు. దీనిపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణకు వినతిపత్రాలు ఇచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ నాయకులు ఈశ్వరరావు, సీఐటీయూ నాయకులు చంద్రశేఖర్, చంద్రమౌళి, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

నర్సుపై దాడి చేసిన వారిపై చర్యలకు డిమాండ్

మహారాణిపేట: విధి నిర్వహణలో ఉన్న నర్సుపై రోగి అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనను ప్రభుత్వ నర్సుల సంఘం జిల్లా అధ్యక్షురాలు టి.గంగాభవానీ ఖండించారు. రోగులకు సేవలందించడంలో నర్సులు కష్టపడి పని చేస్తున్నారని, రోగులు, వారి సహాయకులు నర్సులపై దాడి చేయడం మంచి పద్ధతి కాదన్నారు. దీనిపై అధికార యంత్రాంగం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. విధి నిర్వహణలో ఉన్న నర్సులకు భద్రత కల్పించాలని కార్యదర్శి జీవీఎస్ వరలక్ష్మి కోరారు.